క్లుప్తంగా

వాడపల్లి వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



ప్రముఖులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలో భక్తుల సమస్యలు తెలుసుకున్నారు. అలాగే హైదరాబాద్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ ఓబుల్ రెడ్డి పబ్లిక్ స్కూల్, జూబ్లీహిల్స్ హైదరాబాద్ స్కూల్ కరస్పాండెంట్ ఏవీ రావు దంపతులు, వారి మిత్ర బృందం స్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు స్వామి చిత్రపటం అందజేశారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు చక్రవర్తుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం కూడా భక్తులు పోటెత్తారు.

జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

రాజోలు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26న రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్ మేళా పోస్టర్‌ను శనివారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆవిష్కరించారు. జాబ్‌మేళాలో 13 కంపెనీలకు సంబంధించి 885 ఖాళీలు భర్తీ చేయనున్నట్టు జిల్లా అధికారి పి.లోక్‌మన్ ఎమ్మెల్యే రాపాకకు వివరించారు. రాజోలు నియోజకవర్గానికి చెందిన యువతీయువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు పైడిపర్తి రామారావు, కొల్లాబత్తుల అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలునికి ఆర్థిక సాయం



జి.అగ్రహారంలో బాలుడి తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న పెద్దలు

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం ప్రభాకర్‌నగర్ కాలనీలో కిడ్నీకి సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఐదేళ్ల బాలుడు ధర్మేపాటి ప్రశాంత్‌కు పలువురు రూ.20 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందేశారు. గంగలకుర్రుకు చెందిన గుత్తుల బాల సూర్య జ్ఞాపకార్థంగా దొమ్మేటి నాగన్న, వితనాల శేఖర్, ఎంఎం శెట్టి, వాసంశెట్టి సత్యనారాయణ, రాయుడు కృష్ణమహేష్, గుత్తుల రాంపండు, పలివెల సుబ్రహ్మణ్యం తదితరుల ఆధ్వర్యంలో రూ.20 వేలను బాలుని తల్లిదండ్రులకు అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన ప్రశాంత్ కిడ్నీకి సంబంధించిన రోగంతో ఇబ్బందులు పడుతున్నాడని అతని వైద్య ఖర్చుల నిమిత్తం దాతలు సహకరించాలని గ్రామ పెద్దలు కోరారు.

ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుల పంపిణీ

సఖినేటిపల్లి: ఆయుష్మాన్ భారత్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను శనివారం అప్పనరామునిలంకలో ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు పంపిణీ చేశారు. గ్రామంలో సఖినేటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.పావని నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో లబ్ధిదారులకు ఈ కార్డులను వారు అందజేశారు.

ఆలమూరులో..

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్‌ను అందరూ సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అన్నారు. మండలంలోని చెముడులంక, చొప్పెల్ల గ్రామాల్లో శనివారం ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ చేశారు.

మద్యం బాబుల ఆగడాలను అదుపుచేయాలి

అంబాజీపేట: ప్రధాన రహదారిలో బైక్‌లను అడ్డుగా పెట్టి మహిళలు, విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న మద్యం బాబుల ఆగడాలను అదుపు చేయాలని ఎక్సైజ్, పోలీస్ అధికారులను కోరారు. పుల్లేటికుర్రు వీవర్స్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న మద్యం షాపును అక్కడ నుంచి తొలగించాలని మహిళలు, కాలనీ వాసులు మద్యం షాపు వద్ద శనివారం సాయంత్రం నిరసన చేపట్టారు. సర్పంచ్ జల్లి బాలరాజు, పలువురు మహిళలు మాట్లాడుతూ మద్యం షాపు ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై మద్యం తాగుతూ అటుగా వెళ్లే మహిళలు, విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారన్నారు. అలాగే విద్యార్థినులు, మహిళలపై అసభ్యంగా ప్రవర్తించే వారిపై చర్యలు తీసుకోని పక్షంలో మద్యం షాపు ఎదుట రిలే దీక్షలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీర రవి, వార్డు సభ్యులు అందె రమాదేవి, బట్టు సత్యనారాయణ, దైవపు నందయ్య, వక్కలంక బుల్లియ్య, కె.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అంధరకీ ఆమోదమే..

- తక్కువ ధరలకు జనరిక్ మందులు
- నాణ్యత ఎక్కువ, ఆర్థిక భారం తక్కువ
- క్రానిక్, సీజనల్ వ్యాధులతో పెరిగిన మందుల వినియోగం



ఆలమూరులోని జనరిక్ మందుల షాపు

ఆలమూరు: నేటి ఆధునిక సమాజంలో మారిన జీవన పరిస్థితుల దృష్ట్యా అనేక మంది అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల కంటే మెరుగ్గా వైద్యం అందుతుందనే ఉద్దేశంతో అనేక మంది రోగులు ప్రైవేటు వైద్యశాలలకు వెళుతున్నారు. రోగులు వెళ్లగానే అడ్మిషన్ ఫీజు వసూలు చేయడంతో పాటు సంబంధిత వైద్యుడు పలు రకాల మందులు రాసి తమ ఆస్పత్రుల్లోనే మందులు కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. మందుల ఎమ్మార్పీ ధరలు భరించలేక పేద, మధ్యతరగతి వర్గాలు ఆర్థికంగా కుదేలవుతున్నాయి. మందుల కొనుగోలుపై ప్రజలకు అవగాహన లేక డాక్టర్ రాసింది తీసుకోకపోతే ఏమవుతుందోననే ఆందోళనతో మందులు కొనుగోలు చేసి ఆర్థికభారం మోస్తున్నారు. అందులో బ్రాండెడ్ కంపెనీ మందులు సామాన్య ప్రజలకు మరింత భారంగా మారాయి. వారికి జనరిక్ మందులపై అవగాహన లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం జనరిక్ మందుల వినియోగాన్ని పెంచాలని నిర్ణయించింది. అందులో భాగంగా ప్రధాన పట్టణాల్లో జనరిక్ మందుల షాపులను ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది.

జనరిక్ షాపుల ఏర్పాటుకు ఇది నేపథ్యం

సామాన్యులకు తక్కువ ధరలకే ఔషధాలను అందించాలన్న ప్రధాన లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2015లో జనరిక్ దుకాణాలను ఏర్పాటు చేసింది. అయితే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం జనరిక్ మందుల షాప్‌ల ఏర్పాటును పట్టించుకోలేదు. దీనివల్ల ప్రజలు ఆర్థికంగా నష్టపోయేవారు. వైఎస్సార్ సీపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రతి మండలంలోనూ జనరిక్ మందుల షాప్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల భాగస్వామ్యంతో జనరిక్ మందుల షాప్‌లు ఏర్పాటవుతున్నాయి. కొత్తపేట నియోజకవర్గంలో మూడు, పి.గన్నవరంలో రెండు, రాజోలులో నాలుగుతో కలిపి మొత్తం తొమ్మిది జనరిక్ మందుల షాపులు ఏర్పాటయ్యాయి. అలాగే డివిజన్ పరిధిలోని 23 పీహెచ్‌సీలు, నాలుగు సీహెచ్‌సీల ద్వారా ప్రజలకు ప్రభుత్వం నాణ్యమైన వైద్యం అందిస్తుంది. వాటితో పాటు పలు జనరిక్ షాపులను విస్తృతపర్చే చర్యలు చేపట్టింది.

భారం తగ్గేదిలా...

ప్రైవేటు షాపుల్లో మందులను ఎమ్మార్పీ ధరలకే విక్రయిస్తున్నప్పటికీ ఆ ఎమ్మార్పీ ధర నిర్ధారణలోనే కంపెనీలు లాభార్జనకు అధిక ప్రాధాన్యమిస్తున్నాయని ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. తయారీదారులు, డిస్ట్రిబ్యూటర్లు, రిటైల్ దారుల ద్వారా మందులు రోగులకు చేరతాయి. ఇలా పలు చేతులు మారాల్సి ఉండడంతో ధర అధికంగా ఉండటానికి ఓ కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. ప్రైవేట్ షాపుల విక్రయాలతో పోలిస్తే జనరిక్ దుకాణాల్లోని మందుల ధరలు 10 నుంచి 80 శాతం పైగా తక్కువ ఉంటుంది. పారాసెటమాల్ 10 మాత్రలు ధర జనరిక్ షాపులో రూ.12 కాగా ప్రైవేట్ షాపులో రూ.20 నుంచి రూ.30 ఉంటుంది. రక్తపోటుకు సంబంధించి 10 మాత్రల ధర జనరిక్‌లో రూ.12 కాగా బ్రాండెడ్‌లో రూ.80, మధుమేహ వ్యాధికి చెందిన మెట్‌ఫార్మిన్ 10 మాత్రల ధర జనరిక్‌లో రూ.15 కాగా బ్రాండెడ్‌లో రూ.50కు విక్రయిస్తున్నారు. అలాగే జింక్ మల్టీ విటమిన్ 15 మాత్రలు జనరిక్‌లో రూ.20 కాగా బ్రాండెడ్‌లో 105, గ్యాస్ట్రిక్ 15 మాత్రలు జనరిక్‌లో రూ.15 కాగా బ్రాండెడ్‌లో 135, సీ–విటమిన్ పది మాత్రలు ధర జనరిక్‌లో రూ.40 కాగా ప్రైవేట్ షాపులో రూ.70, డీ–విటమిన్ నాలుగు మాత్రల ధర జనరిక్‌లో రూ.40 కాగా ప్రైవేట్‌లో రూ.90గా ఉన్నాయి.

మందులు బాగా పనిచేస్తున్నాయి



వైద్యులు జనరిక్ మందులు మంచివని చెప్పారు. నాణ్యతపై అపోహలు వీడాలని సూచించారు. నాణ్యమైన మందులు సాధారణ షాపులకంటే తక్కువ ధరకు లభ్యమవుతున్నాయి. నా కుటుంబ సభ్యులు కోసం నేను జనరిక్ షాపులోనే మందులను కొంటున్నాను. బాగానే పనిచేస్తున్నాయి.
– తోరాటి పెంటయ్య, సీనియర్ సిటిజన్, సంధిపూడి

జనరిక్ మందులపై అపోహలొద్దు



జనరిక్ మందులను పూర్తి ప్రభుత్వ పర్యవేక్షణలో విక్రయిస్తారు. వాటి నాణ్యత విషయంలో అపోహలను వీడాలి. పేదలకు అందుబాటులో ఉండటం కోసం జనరిక్ మందుల ధర తగ్గించారు. దాన్ని తక్కువ నాణ్యతగల మందులుగా భావించరాదు. డాక్టరు రాసిన చీటి మేరకు నిశ్చింతగా జనరిక్ షాపులో మందులను కొనుక్కోవచ్చు.
– డి.మల్లికార్జున, వైద్యాధికారి, చొప్పెల్ల

సంక్షేమం, సుభిక్షం దిశగా అడుగులు



తాటిపాకలో మహిళకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: సీఎం జగన్ పాలనలో సంక్షేమం, సుభిక్షం దిశగా రాష్ట్రం అడుగులు వేస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం తాటిపాకలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాపాక నిర్వహించారు. తాటిపాకలో మెయిన్ రోడ్డు, కొత్త కాలనీ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. ఎమ్మెల్యే రాపాకకు పలు చోట్ల మహిళలను హారతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌ను విజయపథంలో నిలపాలని కోరారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో సర్వే చేస్తున్నారన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి ఎస్తేరురాణి, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మానుకొండ బాబురావు, గ్రామశాఖ అధ్యక్షుడు మెడబల రాజ్‌కుమార్, గుబ్బల మనోహర్, బొంతు రమేష్, సరెళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలి



పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రామును సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అభిలషించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడిగా నియమితులైన కొమ్ముల రామును నగరంలో ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయం వద్ద శనివారం సన్మానించారు. అతనికి పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. చిట్టిబాబు మాట్లాడుతూ వైఎస్ జగన్ సారథ్యంలో రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని కార్యోన్ముఖుల్ని చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్యకుమార్, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్ చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, పార్టీ నేతలు తులా గోపాలకృష్ణ, వాకపల్లి వీరాస్వామి, చిక్కం బుజ్జిబాబు, కాంగ్రేగుల శ్రీనివాస్, కొమ్ముల చిన్న, కొమ్ముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పరికరాల పంపిణీ



మామిడికుదురులో విద్యార్థులకు క్రీడా పరికరాలు అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ వారికి అన్ని విధాలా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. మామిడికుదురు ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. ఎంఈఓ మోకా వెంకన్నబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో 50 పాఠశాలలకు కిట్లను అందజేశారు. విద్యార్థులకు ప్రభుత్వ పరంగా అన్ని ప్రోత్సాహాలు అందించే దిశగా సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కౌరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజకుమారి, నగరం ఏఎంసీ చైర్మన్ నక్కా వరలక్ష్మి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, చిక్కం బుజ్జిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో జగనన్న ఆరోగ్య సురక్షపై ఎంపీడీఓ నాతిబుజ్జి అవగాహన కల్పించారు. ఈనెల 30 నుంచి అక్టోబర్ నెలాఖరు వరకు అన్ని సచివాలయాల వద్ద కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రెండు టీంలుగా ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, ఇద్దరు పీహెచ్‌సీ మెడికల్ అధికారులు పాల్గొంటారన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందులో దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణులు, పుట్టుక లోపాలు ఉన్న పిల్లలు అందరినీ డయాగ్నైజ్ చేసి వారిని పెద్ద ఆసుపత్రులకు సర్జరీ నిమిత్తం రిఫర్ చేస్తారన్నారు. వలంటీర్లు గ్రామాల్లో సర్వే చేసేటప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రిక ప్రతి ఇంటికి ఇచ్చి అందులో ఉన్న అంశాలను వివరించాలన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యాధికారి పి.భవానీశంకర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శనివారం వైద్యారోగ్య సిబ్బందికి సెక్టార్ సమావేశం జరిగింది. సెప్టెంబర్ నెలలో సాధించిన ప్రగతిని అధికారులకు ఆరోగ్య సిబ్బంది వివరించారు. అనంతరం సబ్‌సెంటర్ల వారీగా వైద్యాధికారులు రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలు అందజేశారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం కోసమే సురక్ష

అంబాజీపేట: ప్రజల ఆరోగ్యం కోసమే సీఎం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవలని సర్పంచ్ పితాని మంగాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పితాని వీరాస్వామి అన్నారు. నందంపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని హెల్త్ అసిస్టెంట్ జేవీఎస్ఆర్ ప్రసాద్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. వచ్చే నెల 12న గ్రామంలో నిర్వహించే క్యాంపునకు రోగులు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి, ఏఎన్‌ఎం జయంతి, ఎంఎల్‌హెచ్‌పీ వసంతకుమారి, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు న్యాక్ గ్రేడ్ సాధనే లక్ష్యం



కొత్తపేట డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు ప్రసాద్

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అన్నింటా అగ్రస్థానంలో నిలిపి, న్యాక్‌లో అత్యున్నత గ్రేడ్ తీసుకురావటానికి అందరం సమష్టిగా కృషి చేద్దామని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం పిలుపునిచ్చింది. శనివారం సాయంత్రం స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షతన కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల త్వరలో న్యాక్‌కు వెళుతుందన్నారు. ఈ లోపు కళాశాలలో చేపట్టవలసిన కార్యక్రమాలను వివరించారు. వాటిని వేగవంతంగా పూర్తి చేయడానికి పూర్వ విద్యార్థులు తమ వంతు సహకరించాలని కోరారు. న్యాక్ గుర్తింపు తద్వారా అత్యున్నత గ్రేడు సాధనతో కళాశాలకు ఎన్నో సౌకర్యాలు సమకూరుతాయన్నారు. అందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. మీ వైపు నుంచి కూడా సహకరించాలని కోరారు. పూర్వ విద్యార్థుల సంఘం తరపున అధ్యక్షుడు, బ్యాంక్ ఆఫ్ బరోడా రిటైర్డ్ బీఎం ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ అధ్యాపకుల కృషికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి డీఎండీ ప్రసాద్, కోశాధికారి తనికెళ్ల శాస్త్రి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, ఎన్ఎస్ఎస్ పీఓ డీసీహెచ్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.


అన్నదానానికి ఆదర్శంగా అప్పనపల్లి



అప్పనపల్లిలో మాట్లాడుతున్న అరుణాచలం పీఠాధిపతి రుద్రాక్ష స్వామీజీ

మామిడికుదురు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని దేవాలయాల్లో ఉచిత అన్నదానాన్ని మొట్ట మొదటిసారిగా అప్పనపల్లి బాలబాలాజీ ఆలయంలో పరిచయం చేశారని అరుణాచలం పంచలింగాల పీఠాధిపతి శ్రీరుద్రాక్ష స్వామిజీ పేర్కొన్నారు. ఆయన శనివారం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయానికి వచ్చారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామీజీ మాట్లాడుతూ అప్పనపల్లి ఆలయానికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. కొబ్బరికొట్టులో బాలబాలాజీ స్వామి ఆవిర్భవించారన్నారు. 1977లో వెంకటేశ్వరస్వామి సన్నిధిలో నిత్యాన్నదానాన్ని ఆలయ వ్యవస్థాపకులు మొల్లేటి రామస్వామి ప్రవేశ పెట్టారన్నారు. ఇక్కడ ప్రవేశ పెట్టిన కొన్నేళ్ల తర్వాత తిరుపతిలో అన్నదానం ప్రవేశ పెట్టారని స్వామీజీ పేర్కొన్నారు. అన్నదానానికి అప్పనపల్లి ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. అరుణాచలం క్షేత్రంలో కూడా త్వరలోనే నిరంతరం అన్నపూర్ణ సేవ అందించేందుకు సిద్ధమయ్యామన్నారు. అరుణాచలం ఆలయ విశిష్టతను తన పర్యటన ద్వారా భక్తులకు వివరిస్తున్నామని చెప్పారు. అప్పనపల్లిలో కూడా 24 గంటలు అన్నపూర్ణ సేవ (అన్నదానం) ప్రవేశ పెట్టాలన్నారు. దీన్ని అమలు చేసే విధంగా అవకాశం కల్పించాలని వేంకటేశ్వరుని వేడుకున్నానని స్వామీజీ పేర్కొన్నారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

అలరించిన గణపతుల అలంకరణ



తమలపాకుల అలంకరణలో



పుష్పాలంకరణలో అయినవిల్లి వినాయకుడు

అంబాజీపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వేంచేసిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో ఉన్న వినాయకుడు తమలపాకుల అలంకరణతో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు మర్ల వెంకట శ్రీనివాస శర్మ గణపతి నవరాత్రుల సందర్భంగా వినాయకుడిని తమలపాకులతో అలంకరించారు. కె.పెదపూడి కుదుపూడివారిపాలెంలో లక్ష్మీ గణపతి ఆలయం వద్ద, కొర్లపాటివారిపాలెంలో నెలకొల్పిన గణపతి నవరాత్రుల పందిరి వద్ద అన్నసమారాధన చేశారు.

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని చవితి మహోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, అర్చకులు వివిధ పుష్పాలతో కనులపండువగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ఓ చోట పుష్పాలతో వినాయకుని ఆకృతిని తీర్చిదిద్దారు. ఈ రెండు చోట్ల స్వామివారి పుష్పాలతో అలంకరించిన తీరు భక్తులను ఆకట్టుకుంది. స్వామికి విశేష పూజలు, పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, లక్షగరిక పూజ, లక్ష్మీగణపతి హోమం జరిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఆలమూరు: మండలంలోని చెముడులంక ఎస్‌టీఎస్ ఎస్ఎం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికయ్యారు. వివరాల్లోకి వెళితే ఇటీవల కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీ ఎఫ్ఐ) క్రీడల్లో స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. రెజ్లింగ్ 48 కిలోల విభాగంలో తొమ్మిదో తరగతి చదువుతున్న దొండపాటి సత్యనారాయణ సోము సత్యసాయి ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో కొత్తపేటలో నిర్వహించిన అండర్–19 క్రీడల్లో వాలీబాల్ తంగేటి వర్షిష్ కుమార్ (పదో తరగతి), అవిడి సతీష్ (10వ తరగతి) మంచి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. స్థానిక పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు పాల్గొని విద్యార్థులను అభినందించి మెమెంటోలు బహూకరించారు. భవిష్యత్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ భీమిరెడ్డి నాగేంద్ర, కడియం వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఈలి గోపాలరావు, పీఎంసీ చైర్మన్ సుంకర శ్రీనివాసు, ఎంఈఓలు సాలెం రాజు, ఎన్‌వీ సుబ్బరాజు, ప్రధానోపాధ్యాయుడు బి.శివరాం తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: రాజోలు నియోజకవర్గ స్థాయిలో శనివారం మలికిపురంలో జరిగిన అండర్–14, అండర్–17 షటిల్ పోటీలు జరిగాయి. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో అండర్–17 బాలికల విభాగంలో పి. దివ్యశ్రీ (రాజోలు), విన్నర్‌గా, వీఎస్ కీర్తన (రాజోలు) రన్నర్‌గా నిలిచారు. అండర్–17 బాలుర విభాగంలో ఆర్.యశ్వంత్ (సఖినేటిపల్లి) విన్నర్‌గా, కె.హెచ్ వినయ్ (రాజోలు) రన్నర్‌గా నిలిచారు. అండర్–14 బాలికల విభాగంలో వై.పి ప్రసన్న విన్నర్‌గా, వి.శ్రీలక్ష్మి రన్నర్‌గా నిలిచారు. వీరంతా త్వరలో జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు వీరు అర్హత సాధించినట్టు నిర్వహణ కమిటీ కమిటీ కన్వీనర్ ఎస్‌కేపీ సాహెబ్ (బాజీ) తెలిపారు.

సఖినేటిపల్లి: మండలంలో అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి జిల్లా యోగా టీంకు ఎంపికైన మామిడిశెట్టి తేజస్వి, యేడిద భానుసాగర్‌లను పాఠశాల హెచ్‌ఎం పి.సోమ సూర్యకుమారి శనివారం అభినందించారు. అలాగే బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్–14 బాలుర విభాగంలో పోతురాజు రఘు, పి.పవన్ సాయి, అండర్–17 బాలుర విభాగంలో ఎ.బాలాజీ, పి.మున్నా జిల్లా టీంకు ఎంపికైనట్టు కూడా హెచ్‌ఎం తెలిపారు.

హర్రర్ షార్ట్ ఫిల్మ్ ప్రారంభం



షార్ట్ ఫిల్మ్ ప్రారంభోత్సవంలో రచయిత ప్రతాప్ నటీనటులు

మలికిపురం: పీటీ స్క్రీన్ బ్యానర్‌పై ప్రవీణ్ తిరునగరి దర్శకత్వంలో రూపొందించే ప్రొడక్షన్ నెంబర్ వన్ హర్రర్ షార్ట్ ఫిల్మ్ చిత్రీకరణను శనివారం మలికిపురంలో ప్రారంభించారు. సినీ గేయ రచయిత, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మలికిపురంలోని మధురం స్వీట్స్ షాప్‌లో జరిగిన ముహూర్తం షాట్‌కు ప్రతాప్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. ప్రతాప్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సైతం మంచి ప్రతిభ కలిగిన నటులు , సాంకేతిక నిపుణులు ఉన్నారన్నారు. దర్శకుడు ప్రవీణ్ తిరునగరి మాట్లాడుతూ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీగా ఈ షార్ట్ ఫిల్మ్ రూపొందిస్తున్నామన్నారు. ఇందులో మోరం నాయుడు, రాజ్ వర్ధన్ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, హీరోయిన్‌గా అనిత కలిశెట్టి నటిస్తున్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

రాజోలు: వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీలారాణి సూచించారు. శనివారం రాజోలులోని సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ వసతి గృహాన్ని ఆమె సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.గణేష్‌రావు అధ్యక్షతన జరిగిన న్యాయ అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో న్యాయమూర్తి ప్రమీలారాణి మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే జరిగే అనర్థాలు వివరించారు. ర్యాగింగ్ భూతాన్ని విద్యాసంస్థల నుంచి తరిమికొట్టాలన్నారు. ర్యాగింగ్ నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు.

సామూహిక నిర్మూలనతోనే సత్ఫలితాలు

అంబాజీపేట: వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ రైతులందరూ ఒకే రోజున పొలాల్లో ఎలుకల నివారణ మందు పెట్టడం ద్వారా వాటిని అరికట్టడంతో సత్ఫలితాలు సాధించవచ్చని సర్పంచ్ వాసంశెట్టి రేవతి, పార్టీ నాయకుడు వాసంశెట్టి పెదబాబులు అన్నారు. సామూహిక ఎలుకలు నివారణ కార్యక్రమంలో భాగంగా వక్కలంక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ అధ్యక్షతన ఎలుకల మందు, మిశ్రమాన్ని శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సీఆర్పీ జనుపల్లి నాగవేణి, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

అయినవిల్లి: మండలంలోని పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శనివారం అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన మండలంలోని పొట్టిలంక పంతాడి వీరవెంకట దుర్గాప్రసాద్‌కు రూ.లక్ష, శానపల్లిలంకకు చెందిన నేలమూడి మమతకు రూ.2 లక్షలు చెక్కుల రూపంలో వారికి ఎమ్మెల్యే అందజేశారు.

ఘనంగా గణేశ నిమజ్జనం

పి.గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ నిమజ్జనం కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. పి.గన్నవరం, ఎల్.గన్నవరం, మొండెపులంక తదితర గ్రామాల్లో వినాయకుని ఉత్సవ విగ్రహాలను బ్యాండు మేళాల నడుమ, బాణసంచా పేల్చుతూ ఊరేగించారు. అనంతరం పవిత్ర వైనతేయ నదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమాలకు ఆయా ఆలయ, ఉత్సవ నిర్వాహణ కమిటీలు ఆధ్వర్యం వహించాయి.

పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి

కొత్తపేట: సీపీఎస్ ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగించే జీపీఎస్‌ను నిలిపివేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని పూర్వపు తాలూకా స్థాయి ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఫ్యాప్టో రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు శనివారం సాయంత్రం కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, పి.గన్నవరం మండలాల ఫ్యాప్టో నాయకులు స్థానిక మండల రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని జీపీఎస్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయం అధికారులకు మెమోరాండం సమర్పించారు.

భేతాళ స్వామి ఆలయంలో హుండీ చోరీ

అంబాజీపేట: స్థానిక శ్రీనివాసనగర్‌లో ఉన్న విజయ భేతాళ స్వామి వారి ఆయలంలో ఉన్న స్వామి వారి హుండీని శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్వామి వారి ఆలయంలో సుమారు రూ.25 వేలు విలువ చేసే డిబ్బీ, అందులో ఉన్న రూ.25 వేల నగదును దొంగిలించారన్నారు. పరిసర ప్రాంతాల్లో ఎక్కడ స్వామి వారి హుండీ కనిపించలేదన్నారు. ఈ సంఘటనపై విజయ భేతాళస్వామి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శీలం సత్యఅర్జున మోహనరావు తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

సారా కేసులో ఏడాది జైలు

కొత్తపేట: సారాతో పట్టుబడిన కేసులో ఒక వ్యక్తికి సంవత్సరం జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి ఎం.భాస్కరరావు తీర్పునిచ్చినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. శనివారం సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో కొత్తపేట మండలం వాడపాలేనికి చెందిన చోడపనీడి సూర్యచంద్రనాగరాజును గత ఏడాది నవంబరు 25న 5 లీటర్ల సారాతో అరెస్టు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ఎస్.ఆనందరావు వాదించారు.